
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

-పి.పాపిరెడ్డి



# కృషితో అస్తి దుర్భిక్షమ్

ఎద్దు కొమ్ముల మీద పొద్దు పొడిచింది.

మిట్ట మధ్యాహ్నం నిప్పులు చెరిగే సూర్యుడు రంగయ్య నడి నెత్తిమీద నాట్యం చేస్తున్నాడు. చెమటతో ముద్దైపోయిన రంగయ్య మేడి వదలకుండా కాడి తోలుతూనే ఉన్నాడు. తన ముద్దుబిడ్డ స్వేదంతో ఆర్ద్రమైన పుడమితల్లి వేడిగా నిట్టూరుస్తుంది. ఇంతలో పెద్దకొడుకు లింగయ్య చద్ది తీసుకురాగా కాడి వదలి ఇద్దరు భోజనానికి కూర్చొన్నారు. "ఈ సంవత్సరం కూడా మన అప్పులు తీరేటట్లు లేవు నాన్నా. పైగా మరి కాస్తా పెరిగేటట్లున్నాయి" అన్నాడు లింగయ్య ఆవేదనగా.

"అవునురా, అట్లాగే ఉంది. గడిచిన రెండేండ్లు వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటె అప్పులు తెచ్చి బోరుమీద బోరువేసి వరి పండించామా. వడ్లకు ధర రాక వచ్చినకాడికి చాల్లే అని వదిలేస్తిమి. రాత్రింబగళ్ళు కష్టపడి పొగాకు పండిస్తే అదికాస్తా మన పాలిటి 'పగాకు' అయింది. కంది పండింది ఫరవాలేదు అనుకుంటె వాటిని అడిగే దిక్కే లేదు. కాస్త ముందుగా వర్షాలు పడ్డాయి పైర్లు యేద్దామంటే పెట్టుబడికి డబ్బులేదు."

'సొసైటీ లోను వస్తది గదయ్యా'అన్నాడు లింగయ్య సాలోచనగా. "సొసైటీ వలీగాడు వదిలేత్కదా వచ్చేది. వాడి ఫైనాన్సులో మూడు రూపాయల వడ్డీకి పాతికవేలు తెస్తిమి. పెయిడ్ సెక్రటరివాడే, ఫైనాన్సు వాడిదే. చావుబ్రతుకులు రెండు వాడి చేతుల్లో ఉన్నట్లు ఇట్లా ఇచ్చి అట్లా జమ వేసుకుంటాడు."

"అక్కేమొ తన పెద్దకూతురి పెండ్లికి పాతిక వేలన్నా యివ్వకపోతే ఎట్లా అంటుంది. చెల్లెలు సారెపెడ్తే గాని సంసారానికి పోనంటుంది. చిన్నదేమొ మూలన కూర్చుంది. దానికేదో తొందర్లోనే సంబంధం చూడాలి. చదివించడం చాతకాక చిన్నోడిని ఆపేస్తిమి. బరువుబాధ్యతలు మోయడం తప్ప బతుకులో సుఖపడేదేముంది?" లింగయ్య మాటల్లో నిర్వేదంతోపాటు నిష్ఠూరం కూడ కలిసింది.

కొడుకు మాటలకు రంగయ్య ముఖంలోని ముడుతల్లో ఆవేదన తొంగి చూసి అది కాస్తా ఆక్రోషంగా మారింది. "మనమేమి ఊరుకున్నామ్రా. రోజూ సలవ పంచలు కట్టుకొని పలావులు తింటూ ఎవారాలు చేస్తున్నామంటావా. వంటి నిండ బట్టలేదు. పచ్చడి మెతుకులతోనే పొట్ట నింపుకుంటున్నాము. మనమేదో దుబారా చేసినట్లు, నువ్వొకడవే బరువుమోస్తున్నట్లు మాట్లాతావేంది? భూమి మీద పడ్డ ప్రతోడు బరువు మోయక తప్పదు; బతికినంత కాలం బాధలు పడకా తప్పదు." అన్నాడు రంగయ్య వాస్తవిక ఇబ్బందులకు కొంత వేదాంతాన్ని జోడించి. "మనిషిని నమ్ముకొన్నోడు మోసపోతాడేమొ కాని మట్టిని నమ్ముకొన్నోడెప్పుడూ మోసపోడు. మన తాత తండ్రులు భూమిని నమ్ముకొని బతికారు. పది మందిని బతికించారు. మనకు కూడ ఏదో ఒకరోజు మన రోజు రాకపోదు. ఆశావాదాన్ని ఆశ్రయించి కొడుక్కి భవిష్యత్తుమీద భరోసా కల్పించడానికి ప్రయత్నించాడు రంగయ్య.

కాని లింగయ్య ఇష్టంలేని పెళ్ళాంతో కష్టంగా కాపురం చేసినట్లు నిష్ఠూరంగా అన్నాడు. "మా తాత భూస్వామి. భూమిని నమ్ముకొని బతికాడు. పది మందిని బతికించాడు అన్నావు బాగానే ఉంది. కాని ఆ భూమితోపాటు పుట్టెడు అప్పులిచ్చి వెళ్ళాడనే విషయం మరిచిపోతున్నావు. మనంకూడ ఆ భూమిని నమ్ముకొని కష్టంచేసి కండలు కరిగించినా ఆ అప్పులు తీర్చలేక తల్లిలాంటి భూమిని అమ్ముకోవాల్సి వచ్చింది. అయినా నీకింకా భూమిమీద ఆశ చావలేదు. మమకారం పోలేదు. ఈ సంగతి తెలిసినోడు కనుకనే బాబాయి ఈ భూ మాతకు ఒక దండం పెట్టి నగరానికి వెళ్ళి దర్జాగా బతుకుతున్నాడు."

"వాడి సంగతి ఎత్తకు. నాకు వళ్ళు మండిపోద్ది. సిగ్గు లజ్జ వదిలిపెట్టి, మాన మర్యాదలు అమ్ముకొని, ఏడుపు కూడు తినేకంటె పాచి పని చేసుకొని నీతిగా బతకడం మేలు. నీవు రైతు బిడ్డవు. లెఖ్ఖ తీసుకొని కాదు. రెక్కలు నమ్ముకొని బతుకు. సరిసరే నీవు ఎద్దులు తోలుకొని వెళ్ళు. నేను కంచె సరిచేసి వస్తా."

లింగయ్య వెళ్ళాడు కాని లింగయ్య వదిలిన బాణం తాలూకు బాధ మాత్రం వదల్లేదు. ఇట్లాంటి బాణాలు ఎంతోమంది ఎన్నోసార్లు తనమీద ఎక్కుపెట్టి వదిలారు. కాని తన గుండె బండలాగుండి బాణాలే వంగిపోయాయి. కాని తన ధైర్యం సడలిపోలేదు. కాని ప్రస్తుతం పరిస్థితుల ప్రాబల్యంవల్ల అది కొంచెం మెత్తబడిందేమో బాణం అంతగా గుచ్చుకోకపోయినా నొచ్చుకోవడం ఎక్కువైంది.

తనకు, తన తమ్ముడు రాంరెడ్డికి ఆర్థిక స్థితిలో వాస్తవంగా హస్తిమశికాంతరం తేడా వుంది. తనేమో తాతతండ్రుల వృత్తిని నమ్ముకొని కాడిని మెడకుబెట్టుకొని సంసార బండిని లాగుతున్నాడు. ఎంత ప్రయత్నించినా బండి వెనక్కే వెళ్తుంది. భూమమ్మ మోసం చేస్తుందా? తన వృత్తి తప్పా? తన వృత్తి తప్పైతే ఈ దేశం అన్నపూర్ణ ఎట్లయింది? అన్నాన్ని అమ్ముకుంటున్న రోజుల్లోకూడ అతిథిని దేవుడిగా భావించి ఆదరించే ఔన్నత్యం ఎట్లా అబ్బింది? తప్పు భూమిది కాదు. వృత్తిది కాదు. తప్పంతా నీతులు చెప్పి గోతులు తవ్వే నేతలది. రైతుల రక్తం పీల్చే అధికార రాబందులదీ. రైతు లేనిదే రాజ్యం లేదని తెలిసి కూడ తమ కాళ్ళను తామే నరుక్కొనే రాజకీయ బధిరాంధులను తలచుకొని రంగయ్య మనసు బాధాపరితప్తమైంది.

ఆరోజు రాత్రి దేవాలయం దగ్గర సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పురాణ పఠనం జరుగుతుంది. ఇంతలో కారులోంచి దిగాడు రామిరెడ్డి. అత్తరు గుప్పుమంది. వజ్రాల ఉంగరాలు కరంటు కాంతిలో తళుక్కుమన్నాయి. మేఘంలో మెరుపులా మెడలో గొలుసు, తళతళమనే డ్రస్సు, కడిగిన గుండ్రాయిలాంటి ముఖంలోని వర్చస్సు రామిరెడ్డి దర్జా చెప్పకనే చెప్తున్నాయి. జన్మభూమిమీద మమకారమొ, తన పరపతి, పలుకుబడి పదిమందికి తెలియజెయ్యాలనే తపనో, లేక తను పుట్టిపెరిగిన గ్రామం ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా పైకి రాలేకపోతుందనే పరితాపమొ ఏదో గాని మొత్తంమీద రామిరెడ్డి అప్పుడప్పుడు తన స్వగ్రామానికొచ్చి, పది మందిని పలుకరించి, వెళ్ళడం

ఆయనకు అలవాటు. అనుకోకుండా ఆయన ఆరోజు రావడం అదే సమయంలో పంతులుగారి పురాణ కాలక్షేపం సందర్భంగా గ్రామస్తులందరు ఒకచోట చేరి ఉండడం అది ఒక అందివచ్చిన అదృష్టంగా అన్పించింది రామిరెడ్డికి. పంతులు, ప్రజలు ఎంతో ఆదరంగా కుర్చీ వేసి రామిరెడ్డిని కూర్చోబెట్టారు.

రెడ్డి వచ్చాడు గనుక పంతులుగారు మరల మొదలు పెట్టి ఉపోద్ఘాతంగా "కృషితో నాస్తి దుర్భిక్షమ్"అను సూక్తిని అందరు పాటిస్తే మన దేశం తిరిగి సౌభాగ్యవంత మవుతుందని, మన పూర్వీకులు ఈ సూక్తిని పాటించినందువలననే వ్యవసాయం ప్రధానంగాగల మన దేశం ప్రపంచంలో అన్నపూర్ణగా పేరుగాంచినదని, కనుక అందరు 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అనే సూక్తిని అక్షరాలా పాటించాలని సెలవిస్తుండగా రామిరెడ్డి బళ్ళున నవ్వాడు. అందరు ఆశ్చర్యంగా చూశారు. రామిరెడ్డి అందుకున్నాడు.

"మీలాంటి పెద్దలు దేవాలయంలో అందులో దేవుని ఎదుట ఇలాంటి మాటలు చెప్పడం న్యాయం కాదు పంతులుగారు. మీరంటే అనుభవం లేక అన్నారంటే అర్థం ఉంది, కృషిలో తల పండిన వీరంతా ఎట్లా వింటున్నారనేది నా ప్రశ్న. వీళ్ళంతా నిత్య కృషీవళులే. వీళ్ళల్లో బాగుపడిన వాడిని ఒక్కన్ని చూపించండి."

"అదేమిటండి రెడ్డిగారూ! మీ తాత తండ్రులు తరతరాలుగా వ్యవసాయం చేసి పల్లెలను పోషించిన పెద్ద రైతులు. పంట కళ్ళాలు చేస్తే చేటలకొద్ది ధాన్యాన్ని జనానికి పంచిన ధర్మధాతలు. మీ తాతగారు వందెకరాల భూస్వామి. ఆకలి అన్నమాట వినబడకుండా అన్నదానం చేసిన మహానుభావుడు.

శాస్త్రిగారి వాగ్ప్రవాహాన్ని అడ్డుకుంటూ అన్నాడు రామిరెడ్డి. "అవునండి పంతులుగారు. మా తాత నాగిరెడ్డిగారు వందెకరాల భూస్వామి. ఆయన కొడుకు పాతికెకరాల పెద్ద రైతు. ఆయన కొడుకు ఐదెకరాల సన్నకారు చిన్న రైతు. రేపు ఆయన వారసులు భూమిలేని వ్యవసాయ కూలీలు. చూడండి. తరతరాలనుండి కృషిలో తరించిన ధన్య జీవుల సంసారంలో తాత భూస్వామి అయితే మనుమడు కూలీగా స్థిరపడ్డాడు. ఇంతెందుకు అక్కడ కూర్చున్నాడే మా అన్నగారు శ్రీమాన్ రంగారెడ్డిగార్ని చూడండి. ఆయన చెమట చుక్కను నమ్ముకున్న నిత్య శ్రామికుడు. కాని ఆయన జీవితంలో కన్నీరు తప్ప పన్నీరు కనపడడంలేదే. ఆయనే కాదు, ఆయన లాంటి ఎంతోమంది అప్పుల ఊబిలో దిగబడిపోయి పరువు కోసం ప్రాణాలు బిగపట్టుకొని ఉన్నారు. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అనేది పాత సూక్తి. 'కృషితో అస్తి దుర్భిక్షమ్' అనేది నేటి సూక్తి."

రామిరెడ్డి తర్కానికి పంతులుగారు కొంచెం తబ్బిబ్బు పడ్డారు. అయినా సర్దుకొని అన్నారు. "కష్టే ఫలి'అనేది మీకు తెలియంది కాదు రెడ్డిగారు. కష్టపడ్డ వానికి ఫలితం తప్పక లభిస్తుంది."


"కష్టపడే వాడికి ఫలితం లభిస్తే ఇంతమంది రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు పంతులుగారు? ఇంకెంతో మంది చావలేక బ్రతుకుతున్నారు."

రామిరెడ్డిలో ఏదో ఆవేశం తన్నుకు వస్తుంది. ఏదో చెప్పలేని ఉద్విగ్నత ఆయన నరనరాలలో లావాలా ప్రవహిస్తుంది. ఆయన జీవితంలోని నిష్ఠుర సత్యాలు ఒక్కటొక్కటిగా వెలికి రావడం మొదలుపెట్టాయి.

"నా విషయమే చూడండి పంతులుగారు. గ్రాడ్యుయేట్‌నయ్యాక పనిచేస్తే పనికిరానని మా అన్నతో వివాదంపడి పట్నం వెళ్ళాను. నేను శాపగ్రస్త కులంలో పుట్టాను గనుక నాలాంటి అగ్రవర్ణ సామాన్యునికి ఏ ఉద్యోగం రాదని తెలుసు. అందుకే ఒక బార్‌లో మందు బాబుల సేవలో చేరిపోయాను. మందు సేవకొచ్చిన మా మామ- అప్పటికి మామ కాలేదనుకోండి- నన్ను చూసి, నాలో యేమి సుగుణాలు కన్పడ్డాయొ తెలియదు కాని రేపు ఇంటికి రమ్మని అడ్రసిచ్చాడు. మొట్టమొదట మా ఆవిడ- ఆవిడ అప్పటికి మా ఆవిడ కాలేదనుకోండి- ఎదురుగా ధైర్యంగా నిలబడ్డ మొట్టమొదటి మొగవాన్ని నేనే. అంతకుముందు అనేకమంది ఆమెను చూసి హాస్పటల్లో చేరిన వారున్నారు. భూతప్రేత పిశాచాది మాంత్రికులను ఆశ్రయించిన వారున్నారు. కొంతమంది జీవితం మీద విరక్తి చెంది సైన్యంలో చేరి దరిమిలా వీరచక్ర పరమ వీర చక్రల్లాంటి అవార్డులు పొందినవారున్నారు. నా విషయంలో కూడా ఇలాంటి ప్రమాదాలు తప్పవని ఆశిస్తున్న వారి నమ్మకాన్ని వమ్ముచేసి నేను మత్స్య యంత్రాన్ని ఛేదించిన పార్థునిలా నిలబడేసరికి వారు విస్తుపోయి, ఆ తర్వాత ఆనందపడి పిచ్చమ్మను నాకిచ్చి పెండ్లి చేశారు. ఆ తర్వాత ఆమె పేరు సౌందర్యగా మార్చాననుకోండి. అసలు సౌందర్యకు ఆమెకు తేడా ఏముంది? ఆమెకున్నవన్ని ఈమెకున్నాయి. కాకపోతే కాస్త కూర్పులో తేడా అంతే. ఈ విషయం గుర్తించక ఎంతోమంది వెతుక్కుంటూ వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకున్నారు. వాస్తవంగా నేను చూసింది మా ఆవిడను కాదు. మా ఆవిడ వెనుక ఉన్న వాళ్ళ నాన్నగార్ని, ఆయన పనితనాన్ని, పరపతిని. ఆయన ఖాళీ చేతుల్తో నగరానికి వచ్చి కోట్లు కూడబెట్టాడు. కష్టపడి సంపాయించింది అనుకుంటే పొరపాటు. ఇతరుల కష్టార్జితాన్ని పునాదిగా చేసుకొని తన మేధస్సుతో మేడలు కట్టాడు. అలాంటి లక్షణాలు నాలో పుష్కలంగా ఉన్నాయని తొలి చూపులోనే పసిగట్టడం ఆయన మేధా సంపత్తికి నిదర్శనం."

పురాణ కాలక్షేపం కంటె రామిరెడ్డి ఆత్మకథా కాలక్షేపం జనాన్ని బాగా ఆకట్టుకున్నట్లుగా ఉంది. అందుకే అందరు ఊపిరి బిగపట్టి ఆసక్తిగా వింటున్నారు.

మంచినీళ్ళు తాగి రామిరెడ్డి మరల మొదలుపెట్టాడు. "అప్పటి నుండి నేను కూడ మా మామగారి అడుగుజాడలలో నడిచి ఆ మేడమీద మరో రెండు అంతస్తులు వేసి మా పేటకు లీడరునయ్యాను. నా ముగ్గురు కొడుకుల్లో పెద్దోడు ఖద్దరుకట్టే రెండోవాడు పచ్చజెండా పట్టాడు. మూడోవాడు కమలాన్ని నమ్ముకున్నాడు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కాంట్రాక్టుల్లో, కమీషన్లలో మా వాటాకు, కోటాకు లోటు లేకుండా ఏర్పాటుచేశారు.



వాస్తవంగా నేను చూసింది మా ఆవిడను కాదు. మా ఆవిడ వెనుక ఉన్న వాళ్ళ నాన్నగార్ని, ఆయన పనితనాన్ని, పరపతిని. ఆయన ఖాళీ చేతుల్తో నగరానికి వచ్చి కోట్లు కూడబెట్టాడు. కష్టపడి సంపాయించింది అనుకుంటె పొరపాటు. ఇతరుల కష్టార్జితాన్ని పునాదిగా చేసుకొని తన మేధస్సుతో మేడలు కట్టాడు. అలాంటి లక్షణాలు నాలో పుష్కలంగా ఉన్నాయని తొలి చూపులోనే పసిగట్టడం ఆయన మేధా సంపత్తికి నిదర్శనం.

పెద్దమ్మాయి జయప్రదను ఒక బడా కాంట్రాక్టరుకిచ్చి గాంధీ బజారులోని బ్రాందీ షాపు, ఒక అనాథ శరణాలయాన్ని వ్రాసిచ్చాను. రెండో అమ్మాయి జయసుధను ఒక ప్రజాసేవకునికి ఇచ్చి గల్ఫ్ దేశాలకు కూలీలను సరఫరా చేసే వ్యాపారాన్ని అప్పజెప్పాను. అందరం సుఖంగా హాయిగా ఉన్నాము. కృషిని నమ్ముకొన్న మా అన్నను, కృషిని వదిలేసిన మమ్ములను ఒకసారి బేరీజువేసి చూడండి పంతులుగారు. కృషితో దుర్భిక్షం తప్పదు అనేది తప్పక అంగీకరిస్తారు." అన్నాడు రామిరెడ్డి.

జనమంతా స్థబ్దుగా కూర్చొన్నారు. చెమటలు పట్టిన రంగారెడ్డి, సెంటు పూసుకున్న రామిరెడ్డి త్రాసులో చెరో ప్రక్క కూర్చున్నట్లుగా, రామిరెడ్డిముందు రంగారెడ్డి దూదిపింజలా తేలిపోతున్నట్లుగా అన్పించింది.

ఎంత సోదాహరణంగా వివరించినా రామిరెడ్డి వాదన పంతులుగారి మనసుకు నచ్చలేదు. "మీరు కోట్లు కూడబెట్టినా కూటికి మాత్రం రైతును ఆశ్రయించవలసిందే కదా రెడ్డిగారు. ధాన్యంతో తప్ప ధనంతో ఆకలి తీరదు కదా. అందుకే రైతు మానవ జాతికి వెన్నెముక అనేది నిత్యసత్యం." అన్నాడు పంతులుగారు దృఢంగా.

రామిరెడ్డి సానుభూతిగా నవ్వి, "నిజమే పంతులుగారూ. రైతు జాతికి వెన్నెముకే. కాని స్వార్థపరులైన అధికార, అనధికార ప్రముఖులతో ఆ వెన్నెముక రుజాగ్రస్తమైంది. మొలవని విత్తనాలిస్తారు. నకిలీమందు లిస్తారు. పచ్చచొక్కో, ఖద్దరులాల్చో సబ్సిడీలు కొట్టేసి అదునుపోయిన తర్వాత అప్పులమీద ఎరువులిస్తారు. ఈ సమాజపు వేరు పురుగులను అధికార్ల 'తడి'చేతులు పట్టుకోవు. పట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోదు. పండిన పంట రైతుల చేతులు దాటిన తర్వాత మద్దతు ధరలు ప్రకటిస్తారు. ఎగుమతులకు లైసెన్సులిస్తారు. రైతులు తాళికట్టిన మార్కెటు యార్డులు, బోర్డులు రంకు మొగుళ్ళకు అమ్ముడిపోయి రైతులకు కడుపుమంటలు మిగిలిస్తాయి. ఆరుగాలం శ్రమించిన రైతులకు కన్నీళ్ళు. దలారులకు డాలర్లు. అయినా రైతు 'ఖర్మ' అనుకుంటూ, కన్నీళ్ళు తుడుచుకొని మరల కాడి పడతాడేకాని ఖర్మకు బాధ్యులైన రాబందుల మీద ప్రభంజనం వలె విరుచుక పడడు. ఏ రోజైతె రైతు ధనుంజయునిలా, ప్రళయకాల రుద్రునిలా ఈ నరరూప రాక్షసుల మీద విరుచకపడి న్యాయాన్ని నిలబెట్టుకుంటాడో ఆ రోజు నేను నా ముగ్గురి కొడుకులతోపాటు కాడికట్టి, మేడి పట్టి రైతుబిడ్డగా సగర్వంగా నిలబడ్తాను. నా జీవితాన్ని, ఆస్తిపాస్తులను రైతు జాతికి అంకితం చేస్తాను. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అని నినదిస్తాను. అంతవరకు నేను చెప్పిన 'కృషితో అస్తి దుర్భిక్షమ్' అనే సూక్తినే బోధించాలని నా మనవి పంతులుగారు."

రామిరెడ్డి గంభీర స్వరం ఆగగానే స్థాణువులుగా చలనం లేకుండా కూర్చున్న జనం ఒక్కసారిగా చైతన్యవంతమైంది. అందరిని పేరుపేరున పలకరించి సెలవు తీసుకున్నాడు రామిరెడ్డి. రామిరెడ్డి వెళ్ళాడు కాని రామిరెడ్డి జనంమీద వదిలిన రామబాణం లాంటి భావజాలం మాత్రం జనాన్ని వదల్లేదు.

"అవును రామిరెడ్డి చెప్పింది అక్షర సత్యం. ఈ వ్యవస్థ మారందే మనకీ అవస్థ తప్పదు."అనుకుంటూ జనం కల్లోలిత మనస్సులతో ఇళ్ళకు మళ్ళారు. ★